ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

శనివారం 6 ఏప్రిల్ 2024

ఆక్రమణలకు అడ్డా.. పుల్లంపేట

- భారీ ఎత్తున భూఆక్రమణలు
- పలుకుబడి కలిగిన వారికి విలువైన భూముల పందేరం
- ఒకే కుటుంబం 18 ఎకరాల ఆక్రమణ
- పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలు మాత్రం గుట్టలపైన
- కళ్లుండి చూడలేని రెవెన్యూ శాఖ



పుల్లంపేట సమీపంలో కొమ్మనవారిపల్లె రెవెన్యూ గ్రామంలో ఆక్రమణకు గురైన 18 ఎకరాల ప్రభుత్వ భూమిలో నాటిన మామిడి మొక్కలు

పుల్లంపేట, ఏప్రిల్ 5: భూఆక్రమణకు అడ్డాగా పుల్లంపేట మారింది. ఇక్కడ అధికార పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది. సొంత మండలంలోని వారితో పాటు పక్క మండలాల వారు కూడా ఇక్కడికి వచ్చి భూములు ఆక్రమిస్తున్నారంటే రెవెన్యూ అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా మండలంలోని కొమ్మనవారిపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూమి అధికంగా ఉంది. పుల్లంపేట మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఈ రెవెన్యూ గ్రామంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రతి ఒక్కరూ ఈ రెవెన్యూ గ్రామంపై కన్నేసి కబ్జా చేసేస్తున్నారు. దొంగ రికార్డులు సృష్టించి రెవెన్యూ అధికారుల చేతులు తడిపి రికార్డులు సృష్టించుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారుతుండటంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు విచారించి అంతా సక్రమంగా ఉన్నాయని ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు కూడా పంపుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పేదవాడు సెంటు భూమి ఆక్రమించుకుంటే తహసీల్దారు దగ్గర నుంచి గ్రామ రెవెన్యూ సహాయకులు అందరూ కలిసి అక్కడకు వెళ్లి నానా గందరగోళం సృష్టించి ఆక్రమణలు తొలగించామని పత్రికలకు తెలియజేసి ఫొటోలు పెట్టించుకుంటారు. అదే ఎకరాలకు ఎకరాలు ఆక్రమించి కంచె వేసి ఏకంగా వీఆర్వోలు సర్టిపై చేసి ట్రాన్స్‌ఫార్మర్లు పెడుతుంటే వాటి జోలికి ఏమాత్రం వెళ్లరనే విమర్శలున్నాయి.

పుల్లంపేట నుంచి కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల లోపల 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. రెవెన్యూ కార్యాలయం నుంచి కూతవేటు దూరంలో ఈ భూమి ఉంది. కబ్జాదారులు చెరువును కూడా వదల్లేదు. గతంలో కొమ్మనవారిపల్లె రెవెన్యూ విలేజ్‌లో పుల్లంపేట వాసులకు 107 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి పట్టాలు ఇచ్చారు. ఆ తరువాత లబ్ధిదారులకు ఇంటి పట్టాలు చూపకపోవడంతో ఆ భూమిని ఓ నాయకుడు కాజేశాడు. ఏకంగా దొంగ రికార్డులు సృష్టించుకుని అరటి పంట పెట్టేశాడు. తనదే అన్నట్లు 5 ఎకరాల చుట్టూ కంచె వేసి డ్రిప్ కూడా ఏర్పాటు చేశాడు. ఇతనికి ఇతని కుటుంబ సభ్యుల పేరుతో డీకేటీ భూములు అధికంగా ఉన్నాయి. అయినా గానీ అధికారుల అండ రెవెన్యూ అధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో ఈయన జోలికి అధికారులు ఎవ్వరూ వెళ్లడానికి సాహసించడం లేదు. గతంలో బోర్డు పెట్టినా ఆక్రమణదారుడు పీకేశాడు. ఇక్కడ 5 ఎకరాల భూమి సుమారు 2 కోట్ల రూపాయలకు పైగా పలుకుతుంది. ఇంత భూమి ఆక్రమణకు గురైనా పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు వచ్చినా ఏమాత్రం పట్టించుకోలేదు. దీనిని ఆనుకునే ప్రభుత్వ భూమి 18 ఎకరాలు ఆక్రమణకు గురైంది. చిట్వేలి ప్రాంతానికి చెందిన అధికార పార్టీకి చెందిన వ్యక్తి ఇక్కడ భూమిని ఆక్రమించుకున్నాడు. ఇక్కడ ప్రభుత్వ భూమితో పాటు చెరువును కూడా వదల్లేదు. ఆరు నెలల క్రితం ఈ భూమిలో పనులు మొదలు పెట్టాడు. బోర్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి డ్రిప్ ద్వారా మామిడి చెట్లను సాగు చేస్తున్నాడు. 18 ఎకరాలకు ఏకంగా కంచె వేసేశాడు. ఇదంతా కేవలం రెవెన్యూ అధికారుల అండదండలతోనే జరిగిందని చెప్పవచ్చు. అసైన్‌మెంట్ కమిటీలో ఈ భూమి ఎవరికీ ఇవ్వకపోయినా పుల్లంపేట మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్లు దూరంలో డీకేటీ ఇచ్చే నిబంధన లేకపోయినా ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల పేర్లతో ఏకంగా 18 ఎకరాలు ఆక్రమించుకోవడం ఒక ఎత్తయితే, ఇందులో 8 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేసేశారు. ఎటువంటి రికార్డులు లేకపోయినా ఆన్‌లైన్ ఎలా చేశారో ఆ రెవెన్యూ అధికారులకే తెలియాలి. ఇలా భూకబ్జాదారులకు పుల్లంపేట రెవెన్యూ అధికారులకు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి.

గతంలో ప్రభుత్వం పేదలకు డీకేటీ పట్టాలు ఇస్తే అవి ఆన్‌లైన్‌లో లేకపోయినప్పుడు లబ్ధిదారుడు కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా అవి మాత్రం ఆన్‌లైన్‌లోకి ఎక్కవు. డీకేటీ పట్టా ఉందా.. మీ స్వాధీనంలో ఉందా.. మీకు నిజంగా పట్టా ఇచ్చారా, ఎందుకు చేయలేదు... అని నానా తిప్పలు పెట్టి పనిచేయకుండా పబ్బం గడిపే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను ఎటువంటి రికార్డులు లేకుండా ఏకంగా ఆన్‌లైన్ చేసేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ తంతు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో డీకేటీ పట్టా ఇచ్చేందుకు వీలులేదని నిబంధనలు చెబుతున్నాయి. అయినా రెవెన్యూ అధికారులు మాత్రం అవన్నీ పక్కన పెట్టి ప్రభుత్వ భూములను ఏకంగా ఆన్‌లైన్ చేసేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, పలుకుబడి కలిగిన వారు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించేస్తుంటే పుల్లంపేట రెవెన్యూ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ స్థలాలు గుర్తించండి అని ఆదేశాలు జారీ చేస్తే రెవెన్యూ అధికారులు మాత్రం పేదలపై చిన్నచూపు చూస్తున్నారు. పుల్లంపేటకు అతి దగ్గరలో ప్రభుత్వ భూములు ఉన్నా అవి ప్రభుత్వానికి చూపకుండా గుట్టలపై ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ ఇంటి పట్టాలు ఇచ్చేస్తున్నారు.

ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో పుల్లంపేట, పత్తనవారిపల్లె గ్రామస్తులకు పుత్తనవారిపల్లె గుట్ట మీద ఇంటి పట్టాలు మంజూరు చేసింది. అక్కడ ఎవ్వరూ ఇళ్లు కట్టుకోలేదు. దీంతో గుట్ట మరో వైపుకు జగనన్న కాలనీని మార్చారు. ఇక్కడ 180 మందికి పైగా లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారే కానీ ఇంతవరకు ఒక కుటుంబం కూడా అక్కడ జీవనం సాగించే పరిస్థితి లేదు. 30 ఇళ్లకు పైగా పూతల వరకు ఇళ్లు పూర్తయినా ఏమాత్రం సౌకర్యాలు లేవు. ఇంతవరకు రోడ్లు కూడా లేవు. కాలనీకి అసలు రోడ్డే ఏర్పాటు చేయలేదు. వలంటీర్లు పదేపదే లబ్ధిదారులకు ఫోన్ చేసి మీరు ఇల్లు కట్టుకోకపోతే మీకు ఇచ్చిన పట్టా రద్దు చేస్తామని చెప్పడంతో అప్పులు చేసి మరీ కొంతవరకు పనులు కానిచ్చేశారు. సంసారానికి అనువుకాని చోట్ల ఇంటి పట్టాలు మంజూరు చేయడంలో ముందు వెనుక చూడకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టి లబ్ధిదారులు అప్పుల్లో కూరుకుపోయారు. దీనికంతా లబ్ధిదారులకు నివాసానికి ఆమోదయోగ్యంగా లేనిచోట ఇవ్వడంతో ఈ కాలనీ పరిస్థితి ఇలా తయారైంది. అదే కొత్తపేటలో అనువైన చోట జగనన్న కాలనీ ఏర్పాటు చేయడంతో అక్కడ ఇంటి నిర్మాణాలు కొంతవరకు పూర్తయ్యాయి.

పలు రెవెన్యూ సమస్యలతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు ఏళ్ల తరబడి తిరిగినా, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా వారికి మాత్రం పనులు జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. సొంత పట్టా భూమి రికార్డుల్లో వేరొకరి పేరుతో ఉండటంతో దళవాయిపల్లెకు చెందిన ఓ వ్యక్తి రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. ఇప్పటికే నాలుగైదు మార్లు స్పందనలో అర్జీలు ఇచ్చినా పట్టించుకునే నాథుడే లేదు. పుల్లంపేట మండలంలో రెవెన్యూ కార్యాలయంలో కాసులు ఇస్తే ఏ భూమైనా కబ్జా చేసేయొచ్చు.. ఇలా ఉన్న వారికి ప్రభుత్వ భూములు పందారం చేస్తూ పేదవారికి ఇచ్చే ఒకటిన్నర సెంటు ప్రభుత్వ భూమిని అనువుకాని గుట్టలపై ఇవ్వడం ఎంత వరకు సమంజసమో ఉన్నతాధికారులకే తెలియాలి.

ప్రభుత్వ భూముల కబ్జాపై తహసీల్దారు వెంకటనారాయణను వివరణ కోరగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ వేసిన కంచె



కొమ్మనవారిపల్లె రెవెన్యూ గ్రామం 107 సర్వే నెంబరు పక్కన ఆక్రమణ కోసం భూమిని చదును చేసిన దృశ్యం



107 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిలో సాగవుతున్న అరటి తోట



పుత్తనవారిపల్లె గుట్ట మీద పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీ దుస్థితి



గుట్టపైన మంజూరు చేసిన కాలనీకి వెళ్లే దారి అధ్వానంగా ఉన్న దృశ్యం

చీటీల బాధితుల ఆందోళన

- కృష్ణానగర్‌లో ఉద్రిక్తత
- పోలీసులు, బాధితుల మధ్య వాగ్వాదం



కృష్ణానగర్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన చీటీల బాధితులు

మదనపల్లె, ఏప్రిల్ 5: మదనపల్లెలో చీటీల చిచ్చు చల్లారడం లేదు. బాధితులు, నిందితులే కాదు..పోలీసుల మధ్య కూడా రగులుతూనే ఉంది. తమకు న్యాయం చేయాలంటూ బాధితుల్లో కొందరు కలెక్టర్ నుంచి ఎస్పీ వరకూ, రాజకీయ నేతల నుంచి మంత్రి వరకూ వెళుతున్నారు. ఈ క్రమంలో బాధితులు, నిందితుల తరఫున మధ్యవర్తుల ప్రవేశంతో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఒకరు అవునంటే, ఇంకొకరు కాదంటూ చర్చలు సఫలం కావడం లేదు. కేసులు పెట్టారు..కదా కోర్టులో చూసుకుందామని ఒకరు, న్యాయస్థానానికి వెళితే నష్టపోతామని న్యాయం చేయాలని చర్చల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో చీటీలు చెల్లించిన మొత్తంలో 40 శాతం నుంచి 60 శాతం చెల్లిస్తామని నిందితులు మధ్యవర్తుల ద్వారా చెప్పిస్తుండగా, కొందరు వచ్చిన కాడికి రానీలేనని ముందుకొస్తుండగా, మరికొందరు తాము చెల్లించిన మొత్తంలో 90 శాతం చెల్లించాలని పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో కొందరికి 30 శాతం, మరికొందరికి 40 శాతం, ఇంకొందరికి 60 శాతం చెల్లిస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. అయితే ఇలా ప్రకటన చేస్తున్నారే కానీ తమను సంప్రదించలేదని, కేసు పెట్టిన తమను కాదని, ఇంట్లో నుంచి బయటకు రానివారికి మాత్రమే చెల్లిస్తున్నట్లు మరికొందరు బాధితులు వాపోతున్నారు. ఇదిలావుండగా ఇటీవల జరిగిన చర్చల్లో తమకు తమకు చెల్లిస్తామన్న సొమ్ముల మాట ఎత్తకుండా కొందరికి మాత్రమే ఇస్తున్నారని తెలుసుకున్న మిగిలిన బాధితులు కృష్ణానగర్‌లోని ప్రధాన నిందితుడు, వీఎస్‌ఆర్ గ్రాండ్ అధినేత వి.సుధాకర్‌రెడ్డి అన్న నివాసానికి చేరుకున్నారు. అక్కడ కొందరి బాధితులకు డబ్బులు ఇస్తున్నారని తెలుసుకుని, మిగిలిన బాధితులు అక్కడికి వెళ్లారు. మధ్యవర్తుల ద్వారా తమతో చర్చలు జరిపి కుదుర్చుకున్న ఒప్పందం మేరకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన వారికి మాత్రం ఇస్తున్నారని, తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా చేయడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు మద్దతుగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని, ప్రధాన నిందితుడి అన్నగా చెబుతున్న జయనారాయణరెడ్డితో చర్చించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. అంతలో విషయం తెలుసుకున్న మరికొందరు బాధితులతో పాటు వన్‌టౌన్, టూటౌన్ సీఐలు యు.వలిబసు, యువరాజు, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఏదైనా ఉంటే పోలీస్‌స్టేషన్ లేదా కోర్టులో తేల్చుకోవాలని చెప్పడంతో వివాదం మరింత ముదిరింది. పోలీసులు కూడా నిందితులకే వత్తాసు పలుకుతున్నారంటూ బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్..నిందితులు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వరం పెంచి మాట్లాడితే బాగుండదని, అరెస్టు చేస్తామని చెప్పడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు అరెస్టు చేయాల్సింది బాధితులకు అండగా నిలిచేవారిని కాదని, కేసు నమోదైనా దర్జాగా బయట తిరుగుతున్న నిందితులు..సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాషాలను అరెస్టు చేయాలని లేకుంటే తమనే అరెస్టు చేయాలని బాధితులు పోలీసులను నిలదీశారు. బాధితులంతా పెద్దసంఖ్యలో అక్కడికి చేరడంతో గంటపాటు కృష్ణానగర్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసుల సూచన మేరకు బాధితులు వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా ఈ అంశంపై ఇరువర్గాలు చర్చించారు. కేసులు కడితే డబ్బులు రావని కొందరు, డబ్బులు రాకున్నా..నిందితులకు శిక్ష పడాలని మరికొందరు పోలీసుల ముందు వాదించారు. ఇలా అనధికారికంగా చీటీలు నిర్వహించే వారికి గుణపాఠం చెప్పాలని మరికొందరు పోలీసులు దృష్టికి తెచ్చారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని మరికొందరు బాధితులు విన్నవించారు. ఇదిలా ఉండగా, రూ.4 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన వీఎస్‌ఆర్ అధినేత సుధాకర్‌రెడ్డి, ఆయన మేనేజర్‌గా చెబుతున్న కృష్ణారెడ్డిలు స్థానిక డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని కలిసినట్లు చెబుతున్నారు.

'సదరం' స్లాట్ బుకింగ్స్ ప్రారంభం

కలికిరి, ఏప్రిల్ 5: దివ్యాంగుల వైకల్య శాతాన్ని నిర్ధారించడం కోసం జరిపే పరీక్షలకు హాజరు కావడానికి అవసరమైన సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమైంది. గురువారం నుంచే స్లాట్ బుకింగ్ ప్రారంభమైనా సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో ఉన్న కారణంగా మందకొడిగా జరిగాయి. శుక్రవారం నుంచి యథావిధిగా బుకింగ్స్ మొదలయ్యాయి. ఈనెల 8వ తేదీ నుంచి స్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వాటిలో అనుకూలమైన తేదీలు, ఆసుపత్రులను దివ్యాంగులు స్లాట్ బుకింగ్ ద్వారా ఎంచుకోవచ్చు. ఎంచుకున్న తేదీన సంబంధిత ఆసుపత్రిలో శారీరక, మానసిక వైకల్యాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించిన అనంతరం నిర్ధారణ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. గతంలో స్లాట్‌లు బుక్ చేసుకుని వేర్వేరు కారణాలతో హాజరు కాని వారికి సంబంధించిన స్లాట్ తేదీలను కూడా తిరిగి అప్డేట్ చేసి వాటి వివరాలను కూడా అందుబాటులో ఉంచారని అధికార వర్గాలు తెలిపాయి. వాటిని దివ్యాంగులు మరోమారు పరిశీలించుకోవాలని కూడా కోరారు.

11 నుంచి కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 5: కాచిగూడ-తిరుపతి-కాచిగూడ (07655/07654) ప్రత్యేక రైలు కడప మీదుగా నడవనున్నట్లు కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈనెల 11, 18, 25, మే 1వ తేదీల్లో కాచిగూడ నుంచి తిరుపతికి ఈ రైలు నడుస్తుందన్నారు. అలాగే ఈనెల 12, 19, 26, మే 2వ తేదీల్లో తిరుపతి నుంచి కాచిగూడకు వెళుతుందన్నారు. ఈ రైలు కాచిగూడలో గురువారం రాత్రి 10.30కు బయల్దేరి ఎర్రగుంట్లకు శుక్రవారం ఉదయం 6.30కు కడపకు 7.05కు వచ్చి తిరుపతికి శుక్రవారం ఉదయం 10.1గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ప్రతి శుక్రవారం తిరుపతిలో రాత్రి 8.05కు బయల్దేరి కడపకు అదేరోజు రాత్రి 10.25కు, ఎర్రగుంట్లకు 11 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 9.30కు కాచిగూడ చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసీపీకి ఉన్నది 37 రోజులే

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 5: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వానికి ఉండేది ఇక 37 రోజులు మాత్రమే ఉందని, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎన్నికల ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె బైపాస్ రోడ్డులోని రామతులసి కల్యాణ మండపంలో నిర్వహించిన బీజేపీ పార్లమెంట్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇసుక తవ్వకాల కోసమే పింఛా నదిని తెంచారని, అందులో నుంచి వేల టిప్పర్లు ఇసుక దోపిడీ చేశారని గుర్తు చేశారు. అన్నమయ్య డ్యాంలో తట్టెడు మన్ను కూడా పోయకుండా వైసీపీ పాలనలో ఇవి అభివృద్ధి చేసినట్లు చెప్పడం దారుణమన్నారు. మంచి ఎక్కడికి వెళ్లినా మంచిగానే కనిపిస్తుందన్నారు. అన్ని హోదాల్లో ప్రజలకు మేలు జరుగుతుందంటే దానికే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మా సొంతానికి ఏమీ కాదని ప్రజల కోసం అన్నీ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పొత్తు ధర్మం అనుసరించి అందరినీ కలుపుకుని పోయి బూత్ లెవల్‌లో కమలం గుర్తును ఓటర్లకు తెలియజేయజేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. చిత్తూరు జిల్లా కరువు తీర్చడానికి కండలేరు ప్రాజెక్టు ద్వారా రూ.7 వేల కోట్లు నిధులను కేటాయించిన విషయం గుర్తు చేశారు. మన పార్టీ ఏజెంట్లను వైసీపీ ప్రభుత్వం పోలీసుల ద్వారా బైండోవర్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి లీగల్ సెల్ ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు చేయడం ద్వారా అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు నదుల సంగమం ఎలా ఉంటుందో అలాగే పార్టీల పొత్తుతో సంగమంగా ఏర్పడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, రాజంపేట లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్ సురేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాజంపేట ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం : కలెక్టర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ 117వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్‌రామ్ మహోన్నతమైన సేవ చేశారన్నారు. ఆయన కేంద్ర కేబినెట్ మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా దేశానికి ఎంతో సేవ చేశారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడితే ఆయనకు మనం గౌరవం ఇచ్చినట్లు అవుతుందని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అణగారిన కులాల వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తి స్థాయిలో అందేవిధంగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. 1971లో భారతదేశానికి, పాకిస్తాన్‌కు మధ్య జరిగిన యుద్ధ సమయంలో బాబుజగ్జీవన్‌రామ్ రక్షణ శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు దేశప్రజల్లో స్ఫూర్తిని నింపారన్నారు. దేశం పట్ల అదే స్ఫూర్తిని జిల్లా ప్రజలందరూ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి జాకీర్‌హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

జనసైనికులకు అందుబాటులో ఉంటా..

- రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



జనసేన నాయకుడు అతికారి దినేష్‌తో భేటీ అయిన టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తదితరులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 5 : జన సైనికులకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని జనసేన కార్యాలయంలో అతికారి దినేష్ ఆధ్వర్యంలో జరిగిన జనసైనికుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా తాను పోటీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. యువ నాయకుడు అతికారి దినేష్ తనతో పాటు టికెట్టు కోసం ప్రయత్నించారని, పొత్తులో భాగంగా తనకు టీడీపీ టికెట్టు వచ్చిందన్నారు. అతికారి దినేష్‌తో పాటు ఆ పార్టీ జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులకు తాను సేవకుడిగా ఉంటానన్నారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, జనసైనికులు, వీర మహిళలు తన గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు అతికారి దినేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి సుగావాసి బాలసుబ్రమణ్యంను అందరం కలిసి భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జనసైనికులు ఎంతో కష్టపడ్డారని, వారి సేవలను ఎన్నడూ మరువబోమన్నారు. రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే అందరికీ సముచితస్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎద్దల విజయసాగర్, రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, కాకతీయ జిల్లా సేవా సమితి అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, దొంతం శివ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు చేదుఫలం

- కాపులేని మామిడి
- పంటపై ప్రతికూల వాతావరణం
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- సీజన్ మొదలైనా ఇంకా పూర్తిగా రాని కాపు
- గగ్గోలు పెడుతున్న మామిడి రైతులు
- ప్రభుత్వం నుంచి సాయం లేదని ఆవేదన



మామిడి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతి ఏడాది అటు ప్రకృతి ప్రకోపం, ఇటు ప్రభుత్వ వైఫల్యంతో నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాది కూడా మామిడి తోటలపై ప్రతికూల వాతావరణ ప్రభావం చూపింది. పూత ఆలస్యంగా రావడం.. పూత వచ్చినా నిలబడకపోవడంతో మామిడి చెట్లకు కాయలులేక దిగుబ డిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 3 నుంచి 4 టన్నులు రావాల్సిన దిగుబడి అర్ధ టన్ను, ఒక టన్నుకే పరిమితమైంది. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

కడప(రూరల్) ఏప్రిల్ 5: వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 10వేల ఎకరాలలో మామిడి పంట సాగు లో ఉంది. అన్నమయ్య జిల్లాలో ఇంతకంటే ఎక్కువ సాగులో ఉంది. ప్రధానంగా నీలం, బేనీషా పంటలను సాగు చేస్తున్నారు. సాధారణంగా ఒక ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఈమేరకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 60 వేల నుంచి 80 వేల టన్నుల డిగుబడి ప్రతి ఏడాది వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది మామి డి తోటలకు ప్రతికూల వాతావరణం కారణంగా పూత లేకపోవడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది.

ఆలస్యంగా పూత రావడంతో...

సాధారణంగా మామిడిపూత సీజన్ నవంబర్ చివరిలో మొదలై డిసెంబర్, జనవరి ఆఖరి వరకు అనువైన పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు సక్రమంగా ఉన్నపుడు మామిడి చెట్లలో అంతర్గతంగా ఒకరకమైన ఒత్తిడి కలిగి పూత ప్రక్రియ వేగంగా జరుగుతుంది. కానీ ఈ ఏడాది పూత సమయంలో పగలు రాత్రి చలివాతావరణమే కనిపించింది. ఈ కారణంగా మామిడిపూత సక్రమంగా రాలేదని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. దీంతో అదునులో పూత రాకపోగా ఫిబ్రవరి నెల ఆఖరిలో కొన్ని చెట్లకు పూత వచ్చినా.. కాయలు కాకుండానే రాలిపోయింది. కొన్ని తోటల్లో మార్చిలోను పూత వచ్చింది. ఇప్పుడిప్పుడే పిందేలు తయారవుతున్నాయి. ఎండాకాలం లోపు ఇవి పండ్లు అయ్యే పరిస్థితి ఉండదు. దీంతో ఈ పూత సైతం వృథాగానే మిగిలిపోతుంది. ఇప్పుడు ఎక్కడా ఆశించిన మేర కాపులేదు. ప్రస్తుత సీజన్‌లో అదునులో పూత వచ్చిన తోటలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇలాంటి తోటల్లోనే ఇప్పుడు కాయలు ఉన్నాయి.

కౌలుదారులకు తీవ్ర నష్టం

ఈ ఏడాది మామిడితోటలు కౌలుకు తీసుకున్న వారు తీవ్రంగా నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది కౌలు ధరలు పెరి గాయి. అయినప్పటికి కౌలు మొత్తాన్ని ముందుగానే చెల్లించినవారు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో కాపు రాకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. ఇంకొం త కాలం గడిస్తే ఏప్రిల్, మే నెలల్లో పెనుగాలలతో కూడిన అకాల వర్షాలు పడతాయని.. ఇదే జరిగితే పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు. ప్రభు త్వం నుంచి కూడా ఎలాంటి సహాయం అందటంలేదని ఆవేదన చెందుతున్నారు. సకాంలో వర్షాలు కురవకపోవడం, బూజు పురుగు ఆశించటం దిగుబడులపై ప్రభారం చూపిందని రైతులు వాపోతున్నారు.



బుగ్గవంక ప్రాజెక్టు కింద సాగుచేసిన మామిడి తోటలు



ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కాయలు లేని మామిడితోట



పెట్టుబడులు కూడా రావడం లేదు

మామిడి సాగులో ఆశించిన లాభాలు రాకపోగా పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. ఒక ఎకరా పొలంలో పంటను సాగుచేశాను. ప్రతి ఏడాది పంట ఉత్పత్తికి అవసరమైన ఎరువులు, కలుపు నివారణ, మందుల పిచికారి, కూలీ ఖర్చులకు వేల రూపాయలను ఖర్చు చేస్తున్నాం. ప్రతికూల పరిస్థితులతో ప్రతి ఏడు నష్టపోతున్నాం. ఈ ఏడాది మామిడి పూత ప్రాథమిక దశలోనే రాలిపోవడంతో పంట ఉత్పత్తి 75 శాతం తగ్గిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మామి డి రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదు.

- ఏటూరు రామచంద్రారెడ్డి, మామిళ్లపల్లె రైతు, చింతకొమ్మదిన్నె మండలం

ఉత్పత్తి 20 శాతమే...

ఈ ఏడాది మామిడి పంట ఉత్పత్తి 20 శాతమే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడమే ఇందుకు ప్రధా న కారణం. సాధారణంగా మామిడిపూత సీజన్ నవంబర్ చివరిలో మొదలై డిసెంబర్ వరకు ఉంటుంది. కానీ ప్రతికూల పరిస్థితుల కారణంగా పూత సక్రమంగా రాలేదు. రాష్ట్రమంతా ఇదే పరి స్థితి ఉంది. దీంతో ఉత్పత్తి చాలా వరకు తగ్గిపోయింది.

-రాజీవ్ మైఖేల్, ఉద్యానశాఖ జిల్లా అధికారి

ఒక వ్యక్తికి రెండు చిరునామాలా!

- వ్యాపారానికి ఒకటి, రాజకీయానికి మరొకటి
- ఎన్నికల కమిషన్‌ను మోసగిస్తున్న ఎమ్మెల్యే
- కమలాపురం ఎమ్మెల్యేపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు



To
Sri MUKESH KUMAR MEENA, IAS
Chief Electoral Officer & Ex-Officio
Secretary to Govt.
Room No. 192, Ground Floor,
Building No.5, A.P Secretariat,
Velagapudi, Amaravati. 522238

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఏప్రిల్ 5: ఒక వ్యక్తి ఒక చోట నివాసం ఉంటూ.. మరో చోట కూడా నివాసం ఉన్నట్లు తప్పుడు చిరునామాలు చూపించి ఎన్నికల కమిషన్‌ను మోసపుచ్చుతున్నారు. గత రెండు పర్యాయాలు ఇదే పనిచేసి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారంటూ సీఎం జగన్‌రెడ్డి మేనమామ, కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథరెడ్డిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మూడోసారి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో పి.రవీంద్రనాధరెడ్డి నామినేషన్‌ను సమగ్రంగా పరిశీలించి డిస్క్వాలిఫై చేయాలంటూ వీరపునాయునిపల్లె మండల కేంద్రానికి చెందిన పీవీవీ నాగప్రసాద్ ఏపీ ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. 2014లో కడప అసెంబ్లీ పరిధిలో ఓటు హక్కు కలిగినట్లు, 2019లో కమలాపురం పట్టణంలో ఓటు ఉన్నట్లు పేర్కొంటూ ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రభుత్వాన్ని మోసం చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి రవీంద్రనాధరెడ్డి కడప నగరంలో నివాసం ఉన్న విషయం అందరికీ తెలుసని.. కానీ కమలాపురంలో తప్పుడు చిరునామా సృష్టించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తుంది. ఆయన ఆధార్‌కార్డు, ఓటరుకార్డులను పరిశీలిస్తే తేటతెల్లమవుతుందని వివరించినట్లు తెలుస్తుంది. కేవలం ఎన్నికల్లో మాత్రం నామినేషన్ వేసేందుకే కమలాపురం చిరునామాలను ఉపయోగిస్తున్నారని... వ్యాపార లావాదేవీలకు కడపలోని చిరునామా వాడుకుంటున్నట్లు ఫిర్యాదులో వివరించారు. ఆస్తులు కొనుగోలుకు కడపలోని చిరుమానాను వాడుకుంటున్నారని.. ఇందుకు సంబంధించిన భూముల క్రయ విక్రయాలకు రిజిస్ట్రార్ ఆఫీసులో చూపించిన కడపలోని చిరునామా వివరాలను ఫిర్యాదులో స్పష్టం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే కుమారుడు రామాంజులురెడ్డి కూడా 2014, 19 సంవత్సరాల్లో కడప నగరంలో నివాసం ఉంటున్నట్లు చూపించారు. చింతకొమ్మదిన్నె మండంలో జడ్పీటీసీగా పోటీ చేసేందుకు సమర్పించిన నామినేషన్లలో చెన్నూరు మండలంలో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారని వివరించారు. ఈ మేరకు తప్పుడు చిరునామాలతో మోసగిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారని ఒక సమాచారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

పోట్లదుర్తిలో గడ్డివాములు దగ్ధం

- రూ.15 లక్షల మేర ఆస్తినష్టం



దగ్ధమవుతున్న గడ్డివాములు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 5: ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తిలో సుమారు 12 గడ్డివాములు శుక్రవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతి అయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఒక గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో పక్కనే ఉన్న మిగతా వాములకు కూడా గాలికి శరవేగంగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పడిగపాటి శివారెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, పీసీ సుబ్బిరెడ్డి, డి.ఓబులరెడ్డి, కే.లక్ష్మి, పి.రామసుబ్బారెడ్డి, సి.గురప్పల గడ్డివా ములు కాలిపోయినట్లు తెలిసింది. ఈ సంఘటనలో సుమారు రూ.15 లక్షలు నష్టం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. ఆర్టీపీపీ, ప్రొద్దుటూరు, కమలాపురం నుంచి వచ్చిన మూడు ఫైర్ ఇంజిన్ల సహాయంతో శుక్రవారం సాయంత్రం వరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. అసలే పశువుల మేత దొరకడం గగనంగా ఉన్న ప్రస్తుత తరుణంలో గడ్డివాములు కాలిపో వడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 5: మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పరివాహక ప్రాంతంలో పాపాఘ్ని నది నుంచి శుక్రవారం ఉదయం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్, ఇసుకను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కొత్తగంగిరెడ్డిపల్లె సర్పంచు ఇసుక అక్రమ తవ్వకాల, రవాణాను స్థానిక ప్రజలతో కలసి అడ్డుకుని జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో పెండ్లిమర్రి పోలీస్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనుమతులకు మించి తవ్వకాలు జరిపారన్నారు. అక్రమ తవ్వకాలు జరిపితే గ్రామస్థులతో కలిసి అడ్డుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు.

మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి

చెన్నూరు, ఏప్రిల్ 5: మండలంలోని శాటిలైట్ సిటీలో నివాసం ఉంటున్న జింకా లక్షుమ్మ (45) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు సీఐ పార్థసారధి తెలిపారు. ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన ఆ మహిళ 15 సంవత్సరాల క్రితం భర్తతో విడిపోయి శాటిలైట్ సిటీలో నివాసం ఉంటుంది. కాగా 12వ బ్లాక్‌లోని మూడో అంతస్తులో ఆమె నివాసం ఉంటుండగా.. ఆ బ్లాక్ మొత్తం చాలా కాలంగా పూర్తిగా ఖాళీగా ఉంటూ ఒక్కటే నివశిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండగా వారికి వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె అక్కడక్కడా ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగి స్తూ... అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం రాత్రి సీఐ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మూడురోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని.. మృతికి కారణాలు తెలి యాల్సి ఉందన్నారు. అనుమానాస్పదస్థితి కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మైదుకూరు, ఏప్రిల్ 5: ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఉల్లంఘించారంటూ మండలంలోని విశ్వనాథపు రం పంచాయతీ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల సంజీవ రాయుడిని ఎన్నికల సంఘం అధి కా రులు సస్పెండ్ చేశారు. గత నెల 27న ప్రొద్దుటూరులో జరిగిన అధికార పార్టీ బస్సు యాత్రకు రాజకీయ నాయకులతో కలసి బస్సులో వెళ్లినట్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సాక్ష్యాలతో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పీడీ విచారణ జరిపి చర్యలు చేపట్టాలని సిఫారసు చేయడంతో సస్పెండ్ చేసినట్లు ఆర్వో చంద్రమోహన్ తెలిపారు.

భార్యపై అలిగి భర్త ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: భార్యపై అలిగిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చేనేతనగర్‌కు చెందిన ఖాదర్‌బాషా కుమారుడు మస్తాన్(31)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో శుక్రవారం భార్య భర్తలు ఇద్దరు గొడవ పడటంతో భార్యపై అలిగిన మస్తాన్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిరస్మరణీయుడు బాబు జగ్జీవన్‌రామ్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర సమరయోధుడు, బహుఖ ప్రజ్ఞశాలి, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు కొనియాడారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసి ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయుడయ్యారని కొనియాడారు. కార్యక్ర మంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఏఏవో కృష్ణుడు, ఎస్బీ సీఐ సత్యనారాయణ, ఏఆర్ ఆర్ఐలు పెద్దయ్య, శ్రీనివాస్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



మృతి చెందిన దంపతులు యేసయ్య, సుజాత (ఫైల్ ఫొటో)

దువ్వూరు (మైదుకూరు), ఏప్రిల్ 5: మండల కేంద్రమైన దువ్వూరు వద్ద గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్య భర్త మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... దువ్వూరు మండలంలోని భీమునిపాడుకు చెందిన పందిటి యేసయ్య (55), పందిటి సుజాత (46)లు తమ ద్విచక్రవాహనంలో ఎంకుపల్లెలోని ఓ సీమంతం కార్యక్రమా నికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీ పంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ దంపతులను 108 వాహనంలో అసుపత్రికి తరలిస్తుండగా మార్గమ ధ్యంలో యేసయ్య మృతి చెందగా.. సుజాత ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శుక్రవారం మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీని వాసులు తెలిపారు.

వలంటీరు ఆత్మహత్య



జమ్మలమడుగు, ఏప్రిల్ 5: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డు మేదర కాలనీ శివార్లలో శుక్రవారం మధ్యాహ్నం నాగస్వరం సునీత (25) అనే యువతి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మహత్యకు పాల్పడిన నాగస్వరం సునీత వలంటీరుగా పనిచేస్తోంది. అయితే ఉన్నట్లుండి మధ్యాహ్నం ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు అర్బన్ ఎస్ఐ-2 కల్పన తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. మృతురాలికి తల్లిమాత్రమే ఉందని, మృతురాలు మూడవ కుమార్తె అని ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామం చెన్నరాయునిపల్లెకు విచ్చేసిన లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 5: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి వేసవి విడిదికి తన స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెకు శుక్రవారం చేరుకున్నారు. చెన్నరాయునిపల్లెలో కర్ణాటక డీఎస్పీ కృష్ణా, పీటీఎం రెవెన్యూ అధికారులు, పీటీఎం ఎస్ఐ రవీంద్ర బాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆయనకు ఘన స్వాగతం పలికారు. చెన్నరాయునిపల్లెలో ఆయన ఈనెల 13వ తేదీ వరకు స్వగృహంలో ఉంటారు 14వ తేదీన ఉదయం తిరిగి కర్నూల్‌కు వెళతారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, మనోజ్ జయంత్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలతో పాటు రెవెన్యూ అధికారులు పోలీసులు, గ్రామస్థులు ఉన్నారు.

400 గ్రాముల బంగారం సీజ్



వివరాలు వెల్లడిస్తున్న టుటౌన్ సీఐ అబ్దుల్ కరీం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 5: ఎటువంటి ఆధారాలు లేకుండా కోయంబత్తూర్‌కు చెందిన ఓ వ్యాపారి 400 గ్రాముల బంగారాన్ని కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐ రామకృష్ణతో కలిసి తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఆ సమయంలో కోయంబత్తురు పట్టణానికి చెందిన రాజారామ్ కరపుస్వామి అనే వ్యక్తి రాగా తనిఖీ చేశామన్నారు. అతని వద్ద 400 గ్రాముల బంగారు నగలు ఉండగా.. అందుకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు 27లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

మైలవరం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని కరమలవారిపల్లి బైపాస్ రోడ్డు సమీపంలో జూదమాడుతున్న 26 మందిని అరెస్టు చేసినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డిసురేష్ శుక్రవారం తెలిపారు. జూదమాడుతున్న వారంతా చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన వారేనని, వారి వద్ద నుంచి నుంచి రూ.1.21 లక్షల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థల వివాదమై ఘర్షణ.. మహిళపై దాడి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: ఆవులు కట్టే స్థల వివాదమై వరుసకు అక్కఅయ్యే మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ భూకవారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య రాజమ్మ(60) దంపతులు ఊరి బయట చెట్టు కింద ఆవులు కట్టేసుకుని అక్కడే గడ్డి వేసి మేపుతున్నారు. కాగా ఈ స్థలం తమదే అంటూ రాజమ్మ పెద్దనాన్న కుమారుడు వెంకటర మణ అక్కడికి వచ్చి ఆవులను తమ స్థలంలో కట్టవద్దని హెచ్చ రించాడు. ఈ స్థలం ఊరి స్థలమని రాజమ్మ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వెంకటరమణ కర్రతో రాజమ్మ తలపై దాడి చేయడంతో గాయపడిన ఆమెను గ్రామస్థులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

కాకర్లవారిపల్లెనే పోలీసులు టార్గెట్ చేయడం దుర్మార్గం

పెనగలూరు, ఏప్రిల్ 5: మండలంలో 140 గ్రామాలు ఉన్నప్పటికీ కాకర్ల వారిపల్లెను టార్గెట్ చేస్తూ 10 రోజుల వ్యవధిలో మూడుసార్లు తనిఖీల పేరుతో పోలీసులు అరాచకాలు సృష్టించడం దుర్మార్గమైన చర్యగా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, మాజీ టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాధనాయుడులు వేర్వేరుగా పేర్కొన్నారు.

రాజంపేట రూరల్ సీఐ మంజునాధరెడ్డి, పెనగలూరు, రాజంపేట ఎస్ఐల పర్యవేక్షణలో ఎస్ఎస్‌డి బృందాలచే గ్రామంలోని ఇళ్లల్లో ఎటువంటి సర్చ్ వారెంట్ లేకుం డా సోదాలు చేపట్టడం నీచమైన చర్య అన్నారు. కాకర్లవారిపల్లె గ్రామస్తులు ఏమైనా సంఘ విద్రోహశక్తులా అని ప్రశ్నించారు. శుక్రవారం కాకర్లవారిపల్లె గ్రామాన్ని రూపానంద రెడ్డి, విశ్వనాధనాయుడుల బృందాలు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొన్ని సమస్యాత్మక గ్రామాలు ఉన్నప్పటికీ కాకర్ల వారిపల్లె గ్రామం లోనే పది రోజుల వ్యవధిలో నాలుగుసార్లు కవాతు నిర్వహించడం, చివరకు ముగ్గురు ఎస్ఐలను వెంటపెట్టుకొని రూరల్ సీఐ మంజునాధరెడ్డి ఈ దుశ్చర్యకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఈ విషయంపై రూపానందరెడ్డి గ్రామస్తుల సమక్షంలో రాజంపేట డీఎస్పీ చైతన్యతో ఫోన్‌లో మాట్లాడారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తానని డీఎస్పీ చెప్పడంతో రూపానందరెడ్డి గ్రామస్తులకు విషయం చెప్పి అక్కడ నుంచి వెళ్లిపో యారు. అనంతరం గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్, ఎస్పీ కృష్ణారావును కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.

వీరభద్రుడిని దర్శించుకున్న కడప అడిషినల్ సివిల్ జడ్జి



వీరభద్రుడి సన్నిధిలో జడ్జి ప్రదీప్‌కుమార్ దంపతులు

రాయచోటిటౌన్, ఏప్రిల్5: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రుడిని శుక్రవారం కడప అడిషినల్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ జడ్జి కవితలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలం రెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో డీవీ రమ ణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు ఆలయంలోని వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, సుబ్రమణ్యంస్వామి, భద్రకాళి అమ్మవారు, కాలభైరవుడు, వీరభద్రుడు తదితర దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి శాలువా, పూలమాలతో సత్కరించి ఆలయ విశిష్టత గురించి తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రాం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలోని టీడీపీ కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రాయచోటి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నేత ఎస్. రామాంజనేయులు, పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, జిల్లా కోశాధికారి సుధాకర్, అఖిల భారత యువజ సమాఖ్య జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశిష్ట పార్లమెంటేరియన్‌గా నిజమైన ప్రజాస్వామ్యవాదిగా బాబూ జగ్జీవన్‌రాం అంటరాని వారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, కూనాసి సుబ్బరాజు యాదవ్, నాగేశ్వర్‌నాయుడు, చిట్టెం రామచంద్ర, చలపతి నాయుడు, కొండా భాస్కర్‌రెడ్డి, అమావాస్య రెడ్డెయ్య, మట్లి శ్రీనివాసులు నాయుడు, ప్రజా సంఘాల నేతలు రెడ్డెయ్య, రెడ్డినాయక్, పామయ్య, నాగేశ్వరరావు, వెంకట్రమణ, నారాయణ, సుబ్బయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: బాబూ జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ నేతలు

లక్కిరెడ్డిపల్లె: దళితుల ఆశాజ్యోతి సమసమాజ స్థాపకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం అని ముదిరాజ్ సంఘం నాయకుడుకు విజయబాస్కర్ అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిల్లెలో జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ భాతరదేశానికి తొలి దళిత ఉప ప్రధానిగా దళితుల సమస్యలపై పోరాటం చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఎంఈవో సెల్వరాజు, మాజీ సర్పంచు చంద్ర, బసయ్య, హరినాథ, కొండమనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధవటం: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంటు నాగేశ్వరప్ప

సిద్ధవటం: మండలంలోని 11వ పోలీసు బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంటు డి.నాగేశ్వరప్ప నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిదని, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశసేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అసిస్టెంట్ కమాండెంట్లు పి.ఎన్.డి.ప్రసాద్, వి.జయప్రసాద్, ఆర్‌ఐలు, ఎస్ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు వైద్యులు డుమ్మా : డీఎంహెచ్‌వో ఆగ్రహం



హాజరు పట్టికను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

సంబేపల్లె, ఏప్రిల్ 5: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఇద్దరు వైద్యాధికారులు ఒకే రోజు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై డీఎంహెచ్‌వో కొండయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సిన ఇద్దరు వైద్యులు విధుల్లో లేకపోగా, రోగులకు సిబ్బంది మందులు పంపిణీ చేస్తూ కనిపించారు. దీంతో ఆగ్రహించిన ఆయన డాక్టర్లకు ఫోన్ చేసి విధులకు గైర్హాజరు కావడంపై ప్రశ్నించారు. ఇలాంటి సంఘటన పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

'దాహం తీర్చినందుకు కండువా వేశారు'



మాట్లాడుతున్న మేకల మహబూబ్‌బాషా

సుండుపల్లె, ఏప్రిల్ 5: ఇంటికి వచ్చారని తాగేందుకు నీళ్లిస్తే కండువా వేసి, ఫొటోలు తీసి ప్రసార వైసీపీలో చేరినట్లు ప్రచారం చేశారని మైనార్టీ నాయకుడు మేకల మహబూబ్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన శుక్ర వారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం వైసీపీ ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథరెడ్డి తన ఇంటికి వచ్చి వైసీపీలో చేరమని వత్తిడి చేయగా, తాను టీడీపీలోనే ఉన్నానని చెప్పానన్నారు. బలవంతంగా కండువా వేసి, ఫొటోలు తీసి ప్రచారం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. టీడీపీ పుట్టినప్పటి నుంచి ఆ పార్టీలోనే ఉన్నానని, అందులోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ విషయంపై మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడుతూ వైసీపీ రోడ్‌షోలకు, ప్రచారానికి జనం రాకపోతే టీడీపీ కార్యకర్తల ఇంటికి వెళ్లి బలవంతంగా కండువాలు వేపి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మండలంలో ఒక్క టీడీపీ కార్యకర్త, నాయకుడు కూడా వైసీపీలో చేరరన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రసాద్‌రాజు, చంద్రమౌళి, మడితాడు బాషా, ఎల్‌వీ రమణ, గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, ఉపసర్పంచ్ ఆకుల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు



రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు (ఇన్‌సర్ట్) ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహు కాల పూజలు చేశారు. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మ వారికి అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు శనిత్రయోదశి పూజలు

నందలూరు, ఏప్రిల్ 5 : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు సరసారవికుమార్‌శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుండి శనీశ్వ రునికి తైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించాలని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంగనాయకస్వామి ఉత్సవాలు



పూజలుచేస్తున్న మహిళలు

చిట్వేలి, ఏప్రిల్ 5 : చిట్వేలి మండలం నగిరిపాడు రంగ నాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు శుక్రవారం కుమ్మరపల్లె గ్రామస్తులు పౌరాణిక నాటకం, మధ్యాహ్నం కీర్తిశేషులు మన్నూరు రామ్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం, రాత్రి కస్తూరివారి పల్లె వాస్తవ్యుడు బాలు జనార్దన కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా గుంటి గంగమ్మ జాతర

వాల్మీకిపురం, ఏప్రిల్ 5: మండలంలోని బాహుదానది ఒడ్డుపై వెలసిన గుంటిగంగమ్మ జాతర సందర్భంగా గురువారం రాత్రి 8గంటల నుంచి పరిసర గ్రామాల మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుని దీలు బోనాలు సమర్పించారు. రాత్రి చాందినీ బండ్లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక సీఐ పులి శేఖర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కురబలకోట, ఏప్రిల్ 5: లారీ ఢీకొనడంతో స్కూటరిస్టు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తెట్టు పంచాయతీ ఎనములవారిపల్లెకు చెందిన ఆనంద్ కుమారుడు శ్రీనివాసులు(28) వ్యవసాయం, కూలి పనులు చేస్తుంటాడు. శుక్రవారం తన ద్విచక్ర వాహనంలో కప్పరకుంట్ల నుంచి వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో అతను సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాల నేతలతో 'సుగవాసి' భేటీ

రాజంపేట/నందలూరు, ఏప్రిల్ 5: రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం శుక్రవారం పలు వర్గాలను కలసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. ముందుగా చిన్నిల్లుగారిపల్లెకు వెళ్లి రాజంపేట ఎమ్మెల్యే టికెట్టును ఆశించిన పోలి సుబ్బారెడ్డితో భేటీ అయ్యారు. నందలూరులోని చెన్నయ్యగారిపల్లెకు వెళ్లి మేడా విజయశేఖర్‌రెడ్డితో సమావేశమయ్యారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ విజయసాగర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, ఊటుకూరు నాయకులు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేటలోని మసీదులకు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర టీడీపీ మైనారిటీ కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, మైనారిటీ నాయకులు అబుబకర్ తదితర మైనారిటీ నాయకులతో ఇఫ్తార్‌విందు విషయమై మాట్లాడారు. తదనంతరం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంద శివయ్య మాదిగతో కలిసి వారి మద్దతు కోరారు. రాజంపేటలో మాజీ గ్రంథలయ చైర్మన్ రమేష్‌బాబు, రాజంపేట టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, రూరల్ అధ్యక్షులుగన్నె సుబ్బనరసయ్యనాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, ఆకులవీధి నాయకులు ఊటుకూరు రమణరావు, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మన్నూరు నాయకులు బండారు బాలయ్య, అసెంబ్లీ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, వడ్డెర సంఘం నాయకులు శ్రీరాములు తదితరులతో మాట్లాడారు.



జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రమేష్‌బాబు తదితరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం సాయంత్రం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసంఘం నాయకులు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

కార్యకర్తలను బెదిరిస్తే.. తాట తీస్తా : మండిపల్లి

రామాపురం, ఏప్రిల్ 5: టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే తాట తీస్తానని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ గాండ్లగుండ్లపల్లి, మూగిరెడ్డిగారిపల్లె, అగ్రహారం కస్బా, హరిజనవాడల్లో కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పనాయునిచెరువులో విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వైసీపీ నాయకులు, టీడీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి 15 ఏళ్ల, ఆయన తండ్రి ఐదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి రాయచోటి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు వెలిగల్లు కుడి, ఎడమ కాలువ పనులు నాసిరకంగా చేయడంతోనే నియోజకవర్గంలోని ఏ చెరువులకు నీరు అందలేదన్నారు ఈ సందర్భంగా గాండ్లగుండ్లపల్లె హరిజనవాడలో 40 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చంద్రమౌళి, గడికోట భాస్కర్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, దేవా, కృష్ణయ్య, బాలకృష్ణ, చిట్టి రెడ్డెయ్య, పప్పిరెడ్డి హరినాథరెడ్డి, దిలీప్‌కుమార్, శివారెడ్డి, చిన్నగోవిందు, మాజీ డీలర్ చంద్రయ్య, శివారెడ్డి, సుబ్బరామయ్య, చలపతి, రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాలివీడు: మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను గౌరవిస్తానని వారి కష్టాలను తన కష్టాలుగా భావించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం నూలివీడులో మాజీ ఎంపీటీసీ పొట్టి పార్వతమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ పార్థసారథి రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మహబూబ్‌బాషా, సూర్య నారాయణరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని అన్ని మసీదుల్లో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండల టీడీపీ నాయకులు మసూద్, ముక్తార్, అరిఫుల్లా, జే కే రెడ్డి, బషీర్, భాస్కర్‌రెడ్డి, నసీరుద్దీన్, అవేక్, చోటా తదితరులు పాల్గొన్నారు

సుగవాసిని భారీ మెజారిటీతో గెలిపించండి

- గ్రామాల్లో ప్రసాద్ బాబు సుడిగాలి పర్యటన

ఒంటిమిట్ట, ఏప్రిల్5 : ఒంటిమిట్ట మండలంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, మంటపంపల్లె నాయకులు సుంకేశుల బాషా తదితరులతో కలిసి తన అన్న సుగవాసి బాలసుబ్రమణ్యంను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహా రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటసుబ్బయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, శ్రీనివాసులు, బీసీ నాయకుడు ఎస్.వి.రమణ, కాపు సంఘ నాయకుడు కొత్తపల్లి వెంకటయ్య, డాక్టర్ జిలానీబాషా, డాక్టర్ శివకుమార్, మోదుగుల నరసింహులు, డాక్టర్ కృష్ణ, పసుపులేటి వెంకటరమణ, అనం తయ్య, నరసన్నగారిపల్లె నాయకులు ఈశ్వరయ్య, చింతరాజుపల్లి పంచా యతీ కట్టికంవారిపల్లెలో నరసింహులునాయుడు, రాజగోపాల్ నాయుడు తదితరుల మద్దతు కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, తన అన్న సుగవాసి బాలసుబ్రమణ్యంను ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఎంపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.




రాచపల్లెలో పలువురు నేతలతో భేటీ అయిన సుగవాసి ప్రసాద్

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

నిమ్మనపల్లి, ఏప్రిల్ 5: పరిసరాల పరిశుభ్రత మన అందరి బ్యాధ్యత అని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు శుక్రవారం ఆయన రాచవేటివారిపల్లి పంచాయతీలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి తాగునీరు, మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఇంటి చుట్టూ వుండే పెంకులు, పాడైన టైర్లు, తొట్లు ప్లాస్టిక్ డబ్బాలలో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగిపోయి మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులను వ్యాపింపజేసే దోమ ఉత్పత్తికి కారణ మవుతుందన్నారు. ఎక్కువ లార్వా లు వున్న చోట కిరోసిన్‌ను వేసి ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా వుంచుకొంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. గ్రామాల్లోని ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి రోగాలకు దూరంగా వుండాలన్నారు. అనంతరం ఆరోగ్యకార్యకర్తలకు ఆశ కార్యకర్తలకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేంద్ర, వైద్య సిబ్బంది కవిత తదితరుల పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం





ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద కాలువల్లో నిలిచిపోయిన ప్రవాహం, మిస్పా చర్చి వద్ద పేరుకుపోయిన చెత్త

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 5: మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది ఎక్కడ చూసినా చెత్త, ప్లాస్టిక్ కవర్లు దర్శమిస్తున్నాయి. రాయచోటి-వేంపల్లె ప్రధాన రహదారి ఇరుపక్కల ఈ పరిస్థితి నెలకొంది. మిస్పా చర్చి, ఎస్‌బీఐ బజారులో నిత్యం మురుగు నీరు ప్రవహిస్తూనే ఉంటుంది ప్రధాన రహదారిపై మురుగునీటి ప్రవాహం కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ బాలికల హాస్టల్, ఆర్‌టీసీ బస్టాండ్ ఒకటేమిటి ప్రతి బజారులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. లక్కిరెడ్డిపల్లె పంచాయతీ కార్యాలయం నుంచి మూడురోడ్ల కూడలి వరకే కార్మికులు చెత్తను తొలగిస్తారు దీంతో మిగిలిన ప్రాంతాలవారు దుర్గంధాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక మురుగు కాలువల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయాలకు వృద్ధులను బలి చేయొద్దు: సీపీఐ



మాట్లాడుతున్న రాధాకృష్ణయ్య

రైల్వేకోడూరు, ఏప్రిల్ 5: కుళ్లు రాజకీయాల కోసం పెన్షన్‌దారులను బలి చేయొద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణయ్య, రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి పండుగోల మణి నేతలను కోరారు. శుక్రవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో వృద్ధులు, వికలాంగులను సచివాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. దీంతో చాలా మంది వడ దెబ్బకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వలంటీర్లపై ప్రభుత్వం నింద మోపడం అనేది మంచి పద్ధతి కాదన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా వలంటీర్లకు సమాన పనికి సమాన వేతనం రూ. 25,000 ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: పట్టణంలోని మాసాపేటలో శుక్రవారం రోటరీక్లబ్ జిల్లా అధికారి, దాత గాండ్లపెంట ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో 50 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ రంజాన్‌తోఫా అందజేయడం పవిత్ర కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సయ్యద్ నిజాంమోద్దీన్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ పబ్బిశెట్టి సురేశ్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్లు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ రెడ్డెన్న, జిల్లా అధికారి సయ్యద్ అస్రఫ్‌అలీ, మాజీ అధ్యక్షుడు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

గాలివీడు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్‌ఆనంద్ తెలిపారు. శుక్రవారం గాలివీడు మండలంలో ఎస్ఐ వెంకటప్రసాద్‌తో కలిసి గాలివీడు, నూలివీడు, కొర్లకుంట, అరవీడు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ సెంటర్లపై ఎలెక్షన్ విధుల కోసం వచ్చిన కేంద్ర బలగాలకు అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకే ఈ ప్రదర్శన చేశామన్నారు.

ఏపీఎండీసీ వర్కర్స్ యూనియన్‌లో టీచర్ల చేరిక



సీపీవోకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 5: మంగంపేట రిహాబిటేషన్ వర్కర్స్ యూనియన్‌లో శుక్రవారం ఏపీ ఎండీసీ పబ్లిక్ స్కూల్‌లో పనిచేసే టీచర్లు చేరారు ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి, యూనియన్ గౌరవ ప్రెసిడెంట్ తల్లెం రమణారెడ్డి, గౌరవ సలహాదారు గల్లా రమణ, సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సగినాల సుబ్రమణ్యం, సిద్దారెడ్డి, జిలానీ, ఖాదర్, పార్థసారథి, ఫిరోజ్‌దౌలా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికార ప్రతినిధిగా గంగాధరనాయుడు



రామాపురం, ఏప్రిల్5: రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధిగా రామాపురం మండలం రాచపల్లి పంచాయతీ బీదవాండ్లపల్లెకు చెందిన గురిగింజకుంట గంగాధర్‌నాయుడు ఎంపికయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

వృద్ధురాలికి సీపీఐ నేత చేయూత



వృద్ధ మహిళకు సాయం చేస్తున్న సీపీఐ నాయకుడు చిన్నయ్య

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 5: చెన్నకేశవ దేవాలయం మంగళంపల్లె క్రాస్‌లో వృద్ధురాలు స్పృహ తప్పి పడిపోవడంతో సీపీఐ నాయకుడు చిన్నయ్య చేయూతనందించారు. కందులవారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన పెట్లూరు నరసమ్మ (80) అనే వృద్ధురాలు మధ్యాహ్నం ఎండ వేడిమికి ఇబ్బంది పడుతుండటం గమనించిన నియోజక వర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆమెను గోవిందంపల్లి పంచాయతీ శంకరాపురం వరకు బైక్ మీద తీసుకెళ్లి, కూల్ డ్రింక్స్, మంచి నీరు ఇచ్చి స్వస్థత పరిచారు. కోలుకున్న తరువాత చార్జీకి డబ్బులు ఇచ్చి ఆమె గ్రామానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను మండే ఎండల నుండి కాపాడాలని వీరిపై రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

రాయచోటిటౌన్, ఏప్రిల్5: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని డైట్ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి మూల్యాంకనానికి హాజరైన సిబ్బందికి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, ప్రసాద్‌రావు, ఏపీ పీఈటీ అసోషియేషన్ అన్నమయ్య జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఐదేళ్లలో ఎడారిగా మార్చారు



"ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జాడ కన్పించ లేదు. వనరులను దోచుకుని ఎడారి ప్రాంతంగా మార్చారు. ప్రశాంత తంబళ్లపల్లెలో అరాచకాలు సృష్టించారు. భూ దందాలు, అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలన సాగింది. సమస్యల గురించి పాలకులను అడిగేందుకు ప్రజలు భయపడ్డారు. నియోజవర్గంలో పెత్తందారీ వ్యవస్థతో ప్రజలు నలిగిపోయారు. పాలకులు వాళ్ల అనుచర వర్గాలను మాత్రమే అందలమెక్కించారు. ప్రతి పల్లెలోనూ వర్గ రాజకీయాలను పెంచిపోషించారు. అరాచకాలు రాజ్యమేలుతున్న ఈ సమయంలో తంబళ్లపల్లెలో కచ్చితంగా మార్పు రావాలి. తంబళ్లపల్లె నియోజకవర్గం సస్యశ్యామలమై అభివృద్ధి చెందాలంటే టీడీడీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలి" అని తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు.

- వైసీపీ పాలనలో భూ దందాలు.. అరాచకాలు.. దుర్మార్గాలు రాజ్యమేలాయి..
- బ్రిటీషు దొరల తరహాలో నిరంకుశ పాలన
- ప్రశాంత తంబళ్లపల్లెలో వనరులను దోచుకున్నారు
- పశ్నించాలన్నా ప్రజలు భయపడ్డారు
- తంబళ్లపల్లె సస్యశ్యామలం.. అభివృద్ధి జరగాలంటే..
- టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలి
- అంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 5: తంబళ్లపల్లెలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అరాచక, అక్రమ పాలనపై టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ..

? రాజకీయ నేపథ్యం

జ. నా తండ్రి నారాయణరెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కష్టపడి పనిచేస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. దివంగత మాజీ ఎమ్మెల్సీ ఏవీ ఉమాశంకర్‌రెడ్డి ఫాలోయర్‌గా ఉన్నారు. కనుగొండరాయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.

? విద్యాభ్యాసం వివరాలు

జ. ములకలచెరువు మండలం కదిరినాథునికోట ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు చదివాను. ఎనిమిది నుంచి పదవ తరగతి వరకు ములకలచెరువు జడ్పీహైస్కూల్‌లో చదివా. మదనపల్లె సిద్ధార్థ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. నెల్లూరు జిల్లాలోని ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ విద్యానగర్‌లో 1995 నుంచి 1999 సంవత్సరాల్లో బీటెక్ పూర్తి చేశాను.

? మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు కదా.. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది

జ. సొంత నియోజకవర్గం కాబట్టి కొత్తగా ఏమీ అనిపించడం లేదు. బంధువర్గం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో పాటు ప్రజలందరూ సొంత మనిషిగా భావిస్తూ ఆదరిస్తున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతుండడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. ప్రజలు నాపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. అందరూ తమ వాడిగా అక్కున చేర్చుకుంటున్నారు. సమస్యలను నిర్భయంగా నా దృష్టికి తీసుకొస్తున్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తానని భరోసా కల్పిస్తూ ముందుకెళ్తున్నాను. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే కచ్చితంగా అవకాశం కల్పిస్తారని గట్టిగా నమ్ముతున్నా. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు సమస్యలను చెప్పుకునేందుకు భయపడ్డారు. దేశ, రాష్ట్ర అబివృద్ధికి విజన్ ఉన్న నరేంద్ర మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌తో కలిసి నడవడం ఎంతో సంతోషంగా ఉంది.

? వైసీపీ పాలనలో ప్రజలు ఇబ్బంది పడ్డారా..

జ. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో అరాచకాలు, భూ దందాలు, కబ్జాలు, అక్రమ కేసులు రాజ్యమేలాయి. ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ నాయకుల ఒంటెత్తు పోకడతో సామాన్య ప్రజలు భయాందోళనకు గురై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు లక్ష్యంగా పెట్టుకుని అక్రమ కేసులు పెట్టి దాడులకు పాల్పడ్డారు. జైలుకు కూడా పంపారు. రైతులను వ్యవసాయం చేయనీయకుండా, చిన్న వ్యాపారులను, ఉద్యోగులను హింసించారు. అనవసర కేసులు పెట్టి ఉపాధి లేకుండా చేసి చాలా కుటుంబాలను రోడ్డున పడేశారు. అన్నదమ్ముల మధ్య తగాదాలు పెట్టి భయాందోళనకు గురి చేసి విలువైన వందలాది ఎకరాల భూములను అక్రమంగా లాక్కున్నారు. డీకేటీ భూములను అనుచరుల పేర్ల మీద బదలాయించుకుని ఆక్రమించారు. భూ యజమానులపై దాడులకు పాల్పడ్డారు. గద్దల మాదిరిగా భూములను కబ్జా చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణకు, కబ్జాలకు గురైన భూములను బాధితులకు తిరిగిచ్చే బాధ్యతను తీసుకుంటాం.

? వనరుల మాటేంటి

జ. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వనరులను వైసీపీ ధ్వంసం చేసింది. అనుమతులకు మించి వెయ్యి రెట్లు ఎక్కువగా ఇసుకను అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. జల, సాగు నీటి వనరులను ధ్వంసం చేశారు. యంత్రాలలో ఇసుకను ఇష్టానుసాంగా తోడేసి సొమ్ము చేసుకున్నారు. తద్వారా భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు ఎండిపోయి అన్నదాతలకు తీవ్ర నష్టం కలిగించారు. రైతుల కడుపు కొట్టారు. అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం అయ్యేందుకు కారణమయ్యారు. బ్రిటీష దొరలు మన సంపదను కొల్లగొట్టినట్లు నియోజకవర్గ వనరులను వైసీపీ నాయకులు కొల్లగొట్టారు.

? హంద్రీ - నీవా పరిస్థితి ఎలా ఉంది

జ. తంబళ్లపల్లె నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువ పరిస్థితి దారుణంగా తయారైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హంద్రీ-నీవా కాలవకు నిధులు కేటాయించి ఈ ప్రాంతానికి నీరు తెచ్చి సస్యశ్యామలం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే హంద్రీ-నీవా గురించి పట్టించుకోలేదు. వర్షాలకు హంద్రీ-నీవా కాలువ తెగిపోయినప్పుడు, గండ్లు పడినప్పుడు మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. స్వయాన ప్రతిపక్ష నేతగా జగన్ తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించినప్పుడు హంద్రీ-నీవా జలాలు ప్రతి చెరువుకు, కుంటకు తీసుకొస్తానని హామీ ఇచ్చి.. ముఖ్యమంత్రి అయ్యాక మాట తప్పారు.

? హర్సిలీహిల్స్‌లో భూములు కట్టబెట్టాలని చేసి ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేసింది

జ. ఆంధ్ర ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్‌లో కోట్ల రూపాయల విలువ చేసే భూమిని యాత్ర - 2 డైరెక్టర్ రాఘవాకు ముట్టజెప్పాలని వైసీపీ ప్రభుత్వం చూసింది. ప్రజల ఆస్తిని స్టూడియో నిర్మాణం పేరుతో అక్రమంగా కేటాయించాలని చూసింది. ఈ దొంగ, డొల్లతనం బయట పడడం, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనకడుగు వేసింది. మా ఉమ్మడి ప్రభుత్వం రాగానే హార్సీలీహిల్స్ భూములు పరిరక్షిస్తాం.

? ప్రధాన సమస్యలు, అభివృద్ధి మాటేంటి

జ. వైసీపీ ప్రభుత్వ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించలేదు. ప్రచారం కోసం అభివృద్ధి పనులు చేపట్టినట్లు డ్రామాలాడారు. గండికోట జలాలను గాలేరు-నగిరి కాలువను హంద్రీ-నీవాలో అనుసంధానం చేస్తూ చేట్టిన పనుల్లో భాగంగా పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించలేదు. కురబలకోట మండలం ముదివేడు రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. రైతులను నష్టాల పాలు చేశారు. బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో, ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. బి.కొత్తకోటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ వ్యవసాయ మార్కెట్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనుల జాడలేదు. హార్సిలీహిల్స్ కింద ప్రాంతంలో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటు చేసేందుకు భూమి కేటాయించినా పను లు ప్రారంభిం చలేదు. బి.కొత్తకోటను మున్సిపాలి టీగా ప్రకటించినా అభివృద్ధి పనులు జరగేదు. బి.కొత్తకోటలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి పేరుకే ఉంది. వైద్యులను, సిబ్బందిని నియమించ లేదు. పరికరాలు కూడా లేవు. ములక లచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోన్నా రైతులకు కనీస వసతులు కరువయ్యాయి. రైతులకు కనీసం తాగునీటి వసతి కూడా కల్పించలేదు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్ల పరిస్థితి గురించి చెప్పనవసరం లేదు. ప్రభుత్వం రోడ్ల మరమ్మ తులను గాలికొదిలేసింది. ములకలచెరువు నుంచి నియోజక వర్గ కేంద్రమైన తంబళ్లపల్లెకు వెళ్లే రోడ్డు గుంతల మయమై దుస్థితికి చేరుకున్నా ఐదేళ్లుగా మరమ్మతులు చేప ట్టలేదు. ములకలచెరువు, బి.కొత్తకోటల్లోని ముస్లీంల షాదీ మహల్‌కు వైసీపీ ఐదేళ్ల పాలనలో పైసా నిధులు విదల్చలేదు. నిరుపేద ముస్లీం యువతీ, యువకుల వివాహాల కోసం నిర్మించిన షాదీమహళ్లు కనీస వసతులు లేక దుస్థితికి చేరుకున్నాయి. షాదీమహళ్ల గురించి పట్టించుకోకపోవడంతో నిరుపేద ముస్లింలు ఇబ్బందులు పడ్డారు. ముస్లింలకు ఏ విధంగా మంచి చేశారో ఈ షాదీమహళ్లను చూస్తే వైసీపీ ప్రభుత్వ పాలనను అర్థం చేసుకోవచ్చు. తంబళ్లపల్లె అభివృద్ధి జరగాలంటే.. ఇక్కడి నేలంతా సస్యశ్యామలం కావాలంటే.. ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలంటే.. టీడీపీ, బీజేపీ, జనసే న ఉమ్మడి అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలి.



పెద్దతిప్పసముద్రంలో చుక్కనీరు లేని హంద్రీ-నీవా కాలువ

ముగిసిన కళాశాల వార్షికోత్సవాలు

పీలేరు, ఏప్రిల్ 5:పీలేరులోని ఎంజేఆర్ కాలేజీలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవ వేడుకలు జెనిత్ 2క24 కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌కుమార్ రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. ప్రధానంగా నృత్య ప్రతిభను చాటిని వారిని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి హీరో ఆకాష్ పూరి, సింగ్ అఫ్రోజ్ ఆలీ, సైకో రైడర్స్ (చెన్నై), కమెడి యన్, యాంకర్ రవి కిశోర్ వివిధ రకాల ప్రదర్శనలి చ్చారు. వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లారీ కిందపడి స్కూటరిస్టు మృతి

కురబలకోట, ఏప్రిల్ 5: లారీ కిందపడి స్కూటరిస్టు అక్కడిక్కడే మృతి సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు కురబ లకోట మండలం ఎనములవారి పల్లెకు చెందిన ఆనంద్ కుమారుడు శ్రీనివాసులు(28) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కప్పర కుంట్ల వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో లారీ ఢీకొనడంతో దాని కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాదం జరగడంతో ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదం.. మహిళపై దాడి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: ఆవులు కట్టే స్థల వివాదమై వరుసకు అక్క అయ్యే మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు మదనపల్లె మండలం భూకవారిపల్లెకు చెందిన వెంకటర మణ భార్య రాజమ్మ(60) దంపతులు ఊరి బయట చెట్టుకింద ఆవులు కట్టేసుకుని అక్కడే గడ్డి వేసి మేపుతున్నారు. కాగా ఈ స్థలం తమదే అంటూ రాజమ్మపెద్దనాన్న కుమారుడు వెంకటరమణ అక్కడికి వచ్చి ఆవులను తమ స్థలంలో కట్టవద్దని హెచ్చరించాడు. ఈ స్థలం ఊరి స్థలమని రాజమ్మ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వెంకటరమణ కర్రతో రాజ మ్మ తలపై దాడి చేయడంతో గాయపడిన ఆమెను గ్రామస్థులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భార్యపై అలిగి భర్త ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: భార్యపై అలిగిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చేనేతనగర్‌కు చెందిన ఖాదర్‌బాషా కుమారుడు మస్తాన్(31)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో శుక్రవారం భార్య, భర్తలు ఇద్దరు గొడవ పడటంతో భార్యపై అలిగిన మస్తాన్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నిం చాడు. కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సలు అందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నిమ్మనపల్లి, ఏప్రిల్ 5: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు శుక్రవారం ఆయన రాచవేటివారిపల్లి పంచాయతి లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి తాగునీరు, మరుగుదొడ్ల వాడకం పై ప్రజలకు తెలిపారు. ముఖ్యంగా ఇంటి చూట్టూ వుండే పెం కులు, పాడైన టైర్లు,_ పాస్టిక్ డబ్బాలలో నీరు నిల్వ వుంటే పరి శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు ధరి చేరవన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ దేవేంద్ర, వైద్య సిబ్బంది కవిత పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 5: కర్నాటక మద్యం తరలిస్తున్న .జిల్లేల శ్రీనివాసులు(51)అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి 144 లీటర్ల మద్యం స్వాధీనం చేసకున్నట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. చీకలబైలు పంచాయతీకి చెందిన .జిల్లేల శ్రీనివాసు లు గ్రామ సమీపంలో కర్నాటక మద్యం తరలిస్తుండగా రూరల్ సీఐ తన సిబ్బందితో వెళ్లి శ్రీనివాసులను అరెస్టు చేసి మద్యాన్ని సీజ్ చేశారు. అతనిని రిమాండ్ తరలిస్తున్నట్టు తెలిపారు.

పురందేశ్వరిని కలిసిన కొండా నరేంద్ర



పురందేశ్వరితో మాట్లాడుతున్న నరేంద్ర

బి.కొత్తకోట, ఏప్రిల్ 5: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని బి కొత్తకోటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర శుక్రవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ స్థితిగతులపై చర్చించారు. టీడీపీ నేత అయిన కొండా నరేంద్ర తంబళ్లపల్లె నియో జకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవాలని గట్టిగా ప్రయత్నించారు. అయితే తంబళ్లపల్లె అభ్యర్థిత్వం జయచంద్రారెడ్డికి దక్కిన విషయం విదితమే. ఈ నేపథ్యం లో కొండా నరేంద్ర పురందేశ్వరిని కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

స్వగ్రామం చెన్నరాయునిపల్లెకు విచ్చేసిన లోకాయుక్తా జస్టీస్ లక్ష్మణ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 5 : ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా జస్టీస్ లక్ష్మణ్‌రెడ్డి వేసవి విడిదికి తన స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెకు శుక్రవారం చేరుకున్నారు. చెన్నరాయునిపల్లెలో కర్ణాటక డీఎస్పీ కృష్ణా, పీటీఎం రెవెన్యూ అధికారులు, పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆయనకు ఘన స్వాగతం పలికారు. చెన్నరాయునిపల్లెలో ఆయన ఈనెల 13వ తేదీ వరకు స్వగృహంలో ఉంటారు 14వ తేదీన ఉదయం తిరిగి కర్నూల్‌కు వెళతారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, మనోజ్ జయంత్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలతో పాటు రెవెన్యూ అధికారులు పోలీసులు, గ్రామస్థులు ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు

మదనపల్లె టౌన్/అర్బన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అందరికి ఆదర్శనీయుడని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక రామారావుకాలనీలో బహుజన భీమ్‌సేన అధ్యక్షుడు పుంగనూరు శేషాద్రి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. మదనపల్లె పట్టణం వీసీకే పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలా సుదర్శనం, నాయకులు పాల్గొన్నారు.

బి. కొత్తకోటలో:మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని బి. కొత్తకోటలో భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు ఘనంగా నిర్వహించారు. బాస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాస్ నాయకులు సింగన్న, కోగరమాధ వ, వెంకటేష్, గంగాద్రి, నవీన్, శంకర, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పూజలు నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నియో జకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపాల్, నాయకులు పాల్గొన్నారు.

కలకడలో:మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం కలకడలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు హరినాథ్, శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, డాక్టర్ కుప్పుస్వామి నాయుడు, రమణ, మల్లికార్జున్, నటరాజ, గంగాధర్, అంజినేయులు, దినేష్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: మాజీ ఉప ప్రధాన బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. వాల్మీకిపురం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠ శాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలంతా కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి.. గెలిపించండి



జయహో బీసీ సదస్సులో నాయకులతో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్5: వైసీపీ కబంధహస్తాల నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గానికి విముక్తి కలగాలంటే కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి గెలిపించాలని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో క్లస్టర్‌స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ ద్వారా 50 ఏళ్లకే పింఛన్‌ను టీడీపీ ప్రకటించడాన్ని బీసీలందరూ గుర్తించాలన్నారు. ఇక తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ దౌర్జన్యాలు, అరాచకాలు, ఇసుక, గ్రానైట్ దోపిడీ ఏమేరకు జరిగాయో ఈ ఐదేళ్లకాలంలో ప్రతిఒక్కరూ చూశారన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో, కసితో పనిచేసి పార్టీ గెలుపులో పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ విజయసంకల్పయాత్రలో భాగంగా శుక్రవారం బి. కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, కుడుంశ్రీనివాసులు,చిటికి శివారెడ్డి, చింతల కిరణ్‌రాయల్, చెన్నక్రిష్ణ, క్లస్టర్‌ఇన్‌చార్జి కనకంటిప్రసాద్, మొటుకుశివ, యండీ మస్తాన్, బంగారువెంకట్రమణ, గంజిమోహన, రాజాచాకన్నా,రంజిత్ పాల్గొన్నారు.

టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై డిజిటల్ ప్రచారాలు



జెండా ఊపి టీడీపీ డిజిటల్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై డిజిటల్ టీవీ రథం ద్వారా ప్రచారాలు చేస్తున్నట్లు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రుచిర సంస్థ యజమాని గోనుకుంట్ల రామాంజులు, వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రచార రథాన్ని షాజహాన్‌బాషా, టీడీపీ సీనియర్ నాయకుడు మార్పూరి సుధాకర్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు ఈ ప్రచార రథం వెళుతుందన్నారు. మదనపల్లెలో కూటమి అభ్యర్థి గెలుపుతో రాష్ట్రంలో చంద్రబాబును సీఎం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, ఆర్‌జే వెంకటేశ్, ఎం.నాగయ్య, దుర్గాప్రసాద్, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదిన వేడుకలు

రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో షాజహాన్‌బాషా సమక్షంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే టీడీపీ నాయకుడు రాజేష్ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో బాలుస్వామి, పూల మురళి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ, ఎన్‌ఆర్‌సీపై అపోహావద్దు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సీఏఏ, ఎన్‌ఆర్‌సీ బిల్లుల వలన మన దేశంలోని ముస్లీం మైనారిటీలకు ఎటువంటి నష్టం జరగదని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్యారానగర్‌లోని మసీదులో జుమ్మా ప్రార్థనల అనంతరం, మసీదు బయట ముస్లింలతో సమావేశమై మాట్లాడుతూ కొంత మంది వైసీపీ నాయకులు సీఏఏ, ఎన్‌ఆర్‌సీ బిల్లులపై ముస్లీంలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లీం మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, మహ్మద్‌ఖాన్, షంషీర్, నాగర్‌వలి, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

వాల్మీకిపురం, ఏప్రిల్ 5: వాల్మీకిపురం పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి సోదరుడి కుమారుడు, టీడీపీ కార్యకర్త అయిన పద్మనాభాచారి(42) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వాల్మీకిపురం చేరుకుని పద్మనాభాచారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జునరెడ్డి, గాంధీపేట రమణ, పీవీ నారాయణ, వల్లిగట్ల వెంకటరమణ, కోసూరి చంద్రమౌళి, కృష్ణారెడ్డి, మురళి, రామాంజులురెడ్డి, గాంధీపేట రెడ్డి పాల్గొన్నారు.